పార్టీలకతీతంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు

మంత్రి దామోదర రాజనర్సింహ

లబ్ధిదారుడు మిన్పూర్ మల్లయ్యతో కొబ్బరికాయ కొట్టిస్తున్న మంత్రి దామోదర

పుల్కల్, జనవరి 26: పార్టీలకతీతంగా నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందజేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని ఇసోజీపేటలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కొద్దిరోజుల్లో సింగూరు కాలువకు రూ.168 కోట్లతో సీసీ లైనింగ్ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. బస్వాపూర్ శివారులో రూ.150 కోట్లతో ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ భవన నిర్మాణ పనులను చేపట్టబోతున్నామని మంత్రి తెలిపారు. అర్హులైన నిరుపేదల కోసమే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఇసోజీపేట గ్రామానికి 123 ఇందిరమ్మ ఇండ్లు, ఆత్మీయ భరోసా పథకం కింద 31 మంది, నూతన రేషన్‌కార్డుకు 8 మంది ఎంపికయ్యారని, మార్పుచేర్పుల కింద 76 మంది అప్లికేషన్ పెట్టుకున్నారని మంత్రి తెలిపారు. ఎలాంటి బేషజాలకు పోకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఇల్లు మంజూరైన మిన్పూరి మల్లయ్య ఇంటి వద్దకు అధికారులతో కలిసి వెళ్లి మల్లయ్యతో కొబ్బరికాయ కొట్టించారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీవో ఆనంద్ మేరి, ఏవో చైతన్య, దుర్గారెడ్డి, రాంచంద్రారెడ్డి, లక్ష్మారెడ్డి, గోవర్ధన్, బోయిని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు అందజేస్తాం

వైద్యారోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ

నేరడిగుంటలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న మంత్రి దామోదర

అందోల్, జనవరి 26: ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా సౌభాగ్యమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తామని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం మండలంలోని నేరడిగుంటలో ప్రభుత్వం అందజేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా కార్యక్రమాలను లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్రతిఒక్కరికీ పథకాలు అందుతాయని తెలిపారు. గతంలో నేరడిగుంట గ్రామానికి 250 ఇండ్లను మంజూరు చేశామని ఇప్పుడు కూడా ఇండ్లులేని పేదలందరికీ మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రభుత్వ పథకాలన్నీ నిరంతర ప్రక్రియని, విడతల వారీగా అందరికి అందుతాయన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ఆర్డీవో పాండు, స్టేట్ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, శివరాజ్, జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేయాలి

ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

లబ్ధిదారుకు మంజూరు పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జనవరి 26: అర్హులందరికీ పథకాలు అందజేయాలని, లేదంటే బీఆర్‌ఎస్ తరపున ఉద్యమిస్తామని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం సదాశివపేట మండలం ఎల్లారంలో లబ్ధిదారుల సంక్షేమ పథకాల మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ జిల్లాలో రైతు రుణమాఫీ చెక్కు సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేస్తే రైతు ఖాతాలో ఎందుకు జమకాలేదని ప్రశ్నించారు. పూర్తిస్థాయిలో రుణమాఫీ జరిగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను స్వాగతిస్తున్నామన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలన్నారు. ఎకరంలోపు భూమి ఉన్న వారిని కూడా వ్యవసాయ కూలీలుగా గుర్తించాలని, వ్యవసాయ కూలీలకు ఇచ్చే రూ.12వేలు ఇవ్వాలన్నారు. ఒక గుంట భూమి ఉన్న వారికి రూ.250 రైతు భరోసా కింద వస్తే భూమిలేని వారికి రూ.12వేలు వస్తున్నాయని, గుంట భూమి ఉండడం వల్ల ఆ కూలి నష్టపోతున్నాడని గుర్తు చేశారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఉపాధి హామీలో జాబ్‌కార్డు ఉన్నవారందరికీ వర్తించే విధంగా పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో లక్ష్మి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పథకాలు

ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన

చిరాగ్‌పల్లిలో లబ్ధిదారులకు పత్రాలు అందజేస్తున్న హరిచందన

జహీరాబాద్, జనవరి 26: ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ అని, దరఖాస్తుదారులు ఎలాంటి ఆందోళన చెందవద్దని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక కార్యదర్శి హరిచందన అన్నారు. ఆదివారం మండలంలోని చిరాగ్‌పల్లిలో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరో సా, రైతు భరోసా పథకాలను ప్రారంభించారు. ఆయా పథకాల కింద 1101మంది లబ్ధిదారులకు మంజూరైన పత్రాలు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ దరఖాస్తులు చేసుకున్న అర్హులైన లబ్ధిదారులందరికీ పథకాలు అందుతాయన్నారు. అర్హులై ఉండి పేర్లు రాని లబ్ధిదారులు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. న్యాల్‌కల్‌లోనూ, మొగుడంపల్లి మండలంలోని బంజర్‌బౌళి తండాలోనూ లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెట్విల్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ మాధురీ, ఆర్డీవో రాంరెడ్డి, తహసీల్దార్ రవీందర్, భూపాల్, హసీనాబేగం, ప్రత్యేకాధికారులు రవీందర్ రెడ్డి, భిక్షపతి, గోపాల్‌సింగ్, ఎంపీడీవో మహేందర్‌రెడ్డి, రాజశేఖర్, మహేశ్, ఏవో లావణ్య, అవినాశ్ వర్మ పాల్గొన్నారు.

రసాభసాగా సంక్షేమ పథకాల పంపిణీ

బర్దిపూర్‌లో సంక్షేమ పథకాల లిస్టుపై ట్రైనీ కలెక్టర్‌ను ప్రశ్నిస్తున్న ప్రజలు

ఝరాసంగం, జనవరి 26: మండల పరిధిలోని బర్దిపూర్ రైతువేదికలో ఆదివారం నిర్వహించిన సంక్షేమ పథకాల మంజూరు ప్రొసీడింగ్ కాపీల అందజేత రసాభసాగా సాగింది. పారదర్శకత పాటించకుండా అనర్హులకు పథకాలు మంజూరు చేయడంపై లబ్ధిదారులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తమకు ఖాళీ స్థలం ఉండి దరఖాస్తు పరిశీలించినప్పటికీ ఇందిరమ్మ ఇండ్లు ఎందుకు మంజూరు చేయలేదని ట్రైనీ కలెక్టర్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. అనుకూలమైన వారికి ప్రభుత్వ పథకాలు వచ్చాయంటూ అధికారులను నిలదీస్తు అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్రైనీ కలెక్టర్ మనోజ్ మాట్లాడుతూ... అర్హులైన వారి దరఖాస్తులు పునఃపరిశీలించి మంజూరు చేస్తామని, సంక్షేమ పథకాల ఎంపిక నిరంతరమైన ప్రక్రియ అంటూ ఎవరూ అసంతృప్తి చెందకుడదంటూ ప్రజలను బుజ్జగించారు. అనంతరం ప్రతి సంక్షేమ పథకానికి సంబంధించి ఐదుగురికి మంజూరు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిని లలితకుమారి, తహసీల్దార్ తిరుమలరావు, ఎంపీడీవో సుధాకర్, నాయబ్ తహసీల్దార్ యాసిన్‌ఖాన్, ఆర్ఐ రామారావు, ఏవో వెంకటేశం, సీడీసీవో అంజమ్మ, మండల నాయకులు హనుమంత్ రావు పటేల్, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు, మండలస్థాయి నాయకులు హపీజ్, అశ్విన్ పటేల్, మల్లన్న పటేల్, మల్లయ్యస్వామి, గౌసొద్దీన్, మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, మాజీ చైర్మన్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మకమలం



నారాయణఖేడ్, జనవరి 26: పట్టణంలోని సాయిబాబా కాలనీలోని పండరి నాయక్ ఇంట్లో అరుదైన బ్రహ్మకమలం విరబూసింది. హిమాలయాల్లోని మానస సరోవరంలో మాత్రమే కనిపించే ఈ పుష్పాన్ని దైవ పుష్పమనే నమ్మకంతో కుటుంబసభ్యులు, కాలనీవాసులు పూజలు చేశారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- కలెక్టర్ వల్లూరు క్రాంతి
- సంగారెడ్డిలో జాతీయ జెండాను ఆవిష్కరించిన కలెక్టర్
- జిల్లాలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ అనంతరం సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎస్పీ రూపేశ్, అధికారులు

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 26: ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆదివారం జిల్లా కేంద్రమన సంగారెడ్డిలో ఘనంగా జరిగాయి. జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలోని పరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం వివిధ శాఖల ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించినందుకు ప్రశంసా పత్రాలను కలెక్టర్ అందించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం వివిధ శాఖల ద్వారా ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయంలో కలెక్టర్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర, టీజీ ఐఐసీ చైర్‌పర్సన్ తూర్పు నిర్మలారెడ్డి, ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, రెవెన్యూ అధికారి పద్మజారాణి, అదనపు ఎస్పీ సంజీవరావు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరుత్సాహం

పరేడ్ మైదానంలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకలు కొందరు విద్యార్థులకు నిరుత్సాహాన్ని మిగిల్చింది. సంక్షేమ పథకాల అమలు కూడా ఆదివారమే ఉండడంతో కలెక్టర్ సంబంధిత కార్యక్రమాలకు హాజరు కావాల్సి ఉన్నందున పరేడ్ మైదానంలోని వేడుకల సమయాన్ని అధికారులు కుదించారు. దీంతో వారం రోజులుగా వివిధ పాఠశాలల విద్యార్థులు అభ్యాసన చేసిన సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాల సమయాన్ని చివరి రోజు కుదించారు. ఒక్కో గ్రూపులో 100 మంది చొప్పున 7 పాఠశాలల నుంచి దాదాపు 700 మంది విద్యార్థులు తమ ప్రదర్శన రద్దు జరిగిందని నిరుత్సాహానికి గురయ్యారు.

సంగారెడ్డి జిల్లా కోర్టులో, ఎస్పీ కార్యాలయంలో జాతీయ జెండాల ఆవిష్కరణ

అందోల్: బీఆర్‌ఎస్ కార్యాలయంలో నాయకులలతో కలిసి జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి : వట్‌పల్లిలో సహసాలు చేస్తున్న చిన్నారులు

నారాయణఖేడ్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయం వద్ద జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఆర్‌సీపురం: భారతీనగర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించిన కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

సంగారెడ్డి పరేడ్ గ్రౌండ్‌లో స్టాళ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

వరదకాల్వ ఆక్రమణ..!

రామచంద్రాపురం, జనవరి 26: తెల్లాపూర్‌లో కొందరు వ్యక్తులు వరదకాల్వను ఆక్రమించారు. గోపన్‌పల్లిలో ఉన్న పెద్ద చెరువు నుంచి తెల్లాపూర్‌లోని వనం చెరువులోకి వచ్చే వరదనీరు గొలుసుకట్టు కాల్వను కుదిస్తూ కొందరు వ్యక్తులు పైపులు వేస్తున్న విషయాన్ని పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, సాగునీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డె నర్సింహులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఇరిగేషన్ ఏఈ సంతోషి వరదకాల్వ వద్దకు వచ్చి పైప్‌లైన్ పనులను నిలిపివేసి, వాహనాలను సీజ్ చేసి కొల్లూర్ పోలీసులకు సమాచారం అందించారు. ఇరిగేషన్ అధికారులు సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పెద్ద చెరువు, కుమ్మరికుంట, సిరిమయకుంట నుంచి వనం చెరువులోకి వర్షం నీరు వెళ్లేందుకు ఉన్న కాల్వను కుదించి పైపులు వేయడం ఆక్రమణలో భాగమేనని ఇరిగేషన్ ఏఈ సంతోషి హెచ్చరించారు.

అంబులెన్స్‌లో ప్రసవం

హత్నూర, జనవరి 26: కాసాల గ్రామానికి చెందిన మహిళను 108లో దవాఖానకు తరలిస్తుండగా ప్రసవించింది. లక్ష్మీ ప్రసన్నకు పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలోనే బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ ప్రవీణ్, పైలెట్ బాలరాజ్ తెలిపారు.

అంబులెన్స్‌లో జన్మించిన బిడ్డ

చదువుపై ఆసక్తిలేక విద్యార్థి ఆత్మహత్య

మునిపల్లి, జనవరి 26: చదువుపై ఆసక్తిలేక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాలలో ఆదివారం చోటుచేసుకుంది. సదాశివపేట మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన మహేందర్‌రెడ్డి లింగంపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్నాడు. ఈనెల 20న ఇంటినుంచి పాఠశాలకు వచ్చాడు. అంతలోనే మనసు మార్చుకొని హాస్టల్‌లో లగేజీ బ్యాగ్ పెట్టి తిరిగి హాస్టల్ నుంచి బయటకు వెళ్లాడు. హాస్టల్‌కు వచ్చినట్లు సిబ్బందికి కనీస సమాచారం లేదు. కానీ హాస్టల్‌కు వెళ్లినట్లు విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఉంది. ఈనెల 23 నుంచి ప్రాక్టికల్స్ ఉన్నాయని తల్లిదండ్రులకు హాస్టల్ సిబ్బంది ఫోన్ చేసి అబ్బాయిని పంపించమని చెప్పడంతో తల్లిదండ్రులు షాక్‌కు గురయ్యారు. పాఠశాలకు వచ్చిన తల్లిదండ్రులు కుమారుడు కనిపించకపోవడంతో మునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తున్న క్రమంలో సదాశివపేట పట్టణంలోని ఓ చెరువులో శవం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థి సోదరుడు నరేందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజేశ్‌నాయక్ తెలిపారు.

దవాఖాన పనులు వేగవంతం చేయాలి

వట్‌పల్లి, జనవరి 26: దవాఖాన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. మండలకేంద్రంలో 30 పడకల దవాఖాన పనులను ఆదివారం మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..వట్‌పల్లిలో దవాఖాన నిర్మాణానికి రూ.11.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పునాదుల స్థాయిలో ఆసంపూర్తిగా నిలిచిన కమ్యూనిటీ దవాఖాన భవనం ఫిబ్రవరిలో అందుబాటులోకి రావాలన్నారు. దవాఖానలో అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య అధికారులను ఆదేశించారు. మంజూరైన నిధులతో దవాఖాన భవనంతోపాటు, రోగులు, సిబ్బంది విశ్రాంతి భవనాలు నిర్మంచేలా చూడాలని మంత్రి ఆదేశించారు. వట్‌పల్లి కమ్యూనిటీ దవాఖానతోపాటు ఐదు పడకల డయాలసిస్ కేంద్రం కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

పాతపంటల జాతర బండ్లకు స్వాగతం పలుకుతున్న ప్రజాప్రతినిధులు, డీడీఎస్ మహిళలు

చిరుధాన్యాలు ఆరోగ్యానికి ఎంతో మేలు

జహీరాబాద్, జనవరి 26: పాత పంటలైన చిరు ధాన్యాల్లోనే పోషక విలువలు అధికంగా ఉంటాయని జహీరాబాద్ మండలం దిడ్గి డీడీఎస్–కేవీకే శాస్త్రవేత్త డా.రమేశ్ అన్నారు. ఆదివారం మొగుడంపల్లి మండలం ఉప్పర్‌పల్లి తండాలో డీడీఎస్ మహిళా సంఘాల ఆధ్వర్యంలో 25వ పాతపంటల జాతరను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో సాగు చేసే పాత పంటలైన తైదలు, కొర్రలు, సామలు, సజ్జ, జొన్న, పెసర, మినుము తదితర పంటల్లో అనేక పోషక పదార్థాలు అధికంగా ఉంటాయన్నారు. చిరుధాన్యాలతో చేసే వంటకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయన్నారు. కనుమరుగవుతున్న పాత పంటలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం తండాలో డీడీఎస్ మహిళా సంఘాల సభ్యులు, మహిళల కోలాటం, చిటికెల రామాయణం, ఆటపాటలతో పాతపంటల విత్తనాలతో కూడిన ఎడ్లబండ్లతో ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో డీడీఎస్ జాతర కోఆర్డినేటర్లు వినయ్‌కుమార్, మంజుల, సూపర్‌వైజర్ విజయలక్ష్మి, మహిళా సంఘాల సభ్యులు కమిలిబాయి, జార్జీబాయి, రుక్మిణీబాయి, పూలమ్మ, నర్సమ్మ, బాలయ్య, నర్సింహులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ మృతికి సంతాపం

అందోల్, జనవరి 26: మాజీ ఎమ్మెల్సీ, సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణ మృతి పట్ల అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సంతాపం తెలియజేశారు. ఆదివారం అందోల్‌లోని పార్టీ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్సీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టుగా, ఎమ్మెల్సీగా చేసిన సేవలను గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్ర ఎంతో కీలకమని, భగవంతుడు ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ వైస్‌చైర్మన్ జైపాల్‌రెడ్డి, కౌన్సిలర్ భవానీనాగరత్నం గౌడ్, పార్టీ అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బాలయ్య, రామాగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ నాగభూషణం, నాయకులు లింగాగౌడ్, వెంకటేశం, మహేశ్ యాదవ్, బీర్ల శంకర్, నాగరాజు, అశోక్, ఖాజాపాషా, షకీల్, వీరేశం, మొగులయ్య, బాబాఖాన్, దిలీప్‌జైన్ పాల్గొన్నారు.

మహారెడ్డి భూపాల్‌రెడ్డి నివాళి

నారాయణఖేడ్, జనవరి 26: మాజీ ఎమ్మెల్సీ, మాజీ టీఎస్‌పీఎస్సీ సభ్యుడు ఆర్.సత్యనారాయణ మృతి చెందిన నేపథ్యంలో నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి సంగారెడ్డిలోని మాజీ ఎమ్మెల్సీ నివాసంలో ఆయన పార్థివ దేహానికి నివాళులర్పించారు. జర్నలిస్టుగా ఉన్నతమైన సేవలందించిన సత్యనారాయణ తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని మాజీ ఎమ్మెల్యే గుర్తు చేశారు.



మాజీ ఎమ్మెల్సీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్, పార్టీ శ్రేణులు



మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణ పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

శ్రీకాంత్‌గౌడ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు

పటాన్‌చెరు, జనవరి 26: పటాన్‌చెరు మాజీ జడ్పీటీసీ, బీఆర్‌ఎస్ నాయకుడు గడీల శ్రీకాంత్‌గౌడ్‌ను సిద్ధిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం గడీల శ్రీకాంత్‌గౌడ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఇస్నాపూర్ చౌరస్తాలోని బీఆర్‌ఎస్ కార్యాలయానికి హరీశ్‌రావు వచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌గౌడ్‌ను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. హరీశ్‌రావును మాజీజడ్పీటీసీ ఘనంగా సన్మానించారు. అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్, కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై శ్రీకాంత్‌గౌడ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

సంగారెడ్డి పరేడ్ మైదానంలో విద్యార్థుల వేషధారణ

పాఠశాలలో బోరు వేయించిన నాయకుడు

గుమ్మడిదల, జనవరి 26: మండలకేంద్రంలోని గుమ్మడిదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీఆర్‌ఎస్ నాయకుడు, సీజీఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి బోరు వేయించారు. ఇందులో పుష్కలంగా నీరు రావడంతో గ్రామస్తులు, హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు తాగునీటి తిప్పలు తీర్చడానికి బోరు తవ్వించినట్లు గోవర్ధన్‌రెడ్డి వెల్లడించారు. వెంటనే బోరు మోటారును దించి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. వీరితోపాట మాజీ జడ్పీటీసీ కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

సగరులు అభివృద్ధి చెందాలి

జహీరాబాద్, జనవరి 26: సగర కులస్తులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు అన్నారు. ఆదివారం న్యాల్‌కల్ మండలంలోని ఖలీల్‌పూర్‌లో ఏర్పాటు చేసిన సగర సంఘం సమావేశంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను అవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సగర కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తాన్నారు. సమావేశంలో సగర సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తుక్కన్న, కార్యదర్శి జనార్ధన్, మండల సగర సంఘం నాయకులు గోపాల్, సంగమేశ్, రాములు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

గుమ్మడిదల, జనవరి 26: మండలంలోని కొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేశారు. ఆదివారం గ్రామానికి చెందిన యువ నాయకుడు సురారం మహేశ్ సొంత ఖర్చులతో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. వీరితో పాటు మాజీ సర్పంచ్ బానోతు ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ విజయ్‌కుమార్, ఆగం రాజు, గాలి మంజులామల్లేశ్, పెండం జ్యోతీప్రభ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మడిదలలో అధ్యక్షుల ఎన్నిక

గుమ్మడిదల, జనవరి 26: గుమ్మడిదలలో ఆలయాల కమిటీని, రైతు సంఘం కమిటీని గ్రామస్తులందరూ కలిసి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ఆలయ కమిటీ అధ్యక్షుడిగా మద్దుల బాల్‌రెడ్డిని, రైతు సంఘం అధ్యక్షుడిగా సదానందరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎంపికైన అధ్యక్షులను బీఆర్‌ఎస్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మూడుచింత నరేందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పడమటి లక్ష్మారెడ్డి, పోచుగారి మోహన్‌రెడ్డి, రైతులు శాలువాతో సన్మానించారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థికి నగదు బహుమతి

రాయికోడ్, జనవరి 26: చదువుకున్న పాఠశాలకు సాయం చేయాలనే ఉద్దేశంతో 2001–2002లో చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ.10 వేల బహుమతిని అందజేశారు. ఆదివారం రాయికోడ్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో 2023–24 సంవత్సరంలో మండల టాపర్‌గా నిలిచిన్న శంశోద్దీన్‌పూర్ గ్రామానికి చెందిన మధుకర్‌కు ఘనంగా సన్మానించి రూ.10 వేలు నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో అంజయ్య, పూర్వవిద్యార్థులు సాయిరాం, గోపాల్, హనుమంతరావు, ఆంజనేయులు, మొగులప్ప పాల్గొన్నారు.

హెల్మెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే

హెల్మెట్స్ అందజేత

పటాన్‌చెరు, జనవరి 26: స్విగ్గీ, జొమాటో సంస్థల్లో పనిచేస్తూ నిత్యం ద్విచక్ర వాహనాలపై ఫుడ్ డెలివరీ చేసే చిరుద్యోగులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా మేరా ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హెల్మెట్లు అందజేశారు. ఆదివారం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లో గణతంత్రదినోత్సవ సంబురాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్విగ్గీ, జొమాటో డెలివరీ బాయ్స్‌కి హెల్మెట్లు పంపిణీ చేశారు. మేరా ఇండియా సంస్థ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, వెంకట్‌రెడ్డి, బాలామణీశ్రీశైలం, శోభాకృష్ణారెడ్డి, మెరాజ్ ఖాన్, రామకృష్ణ, రవి, తన్వీర్, ఆరీఫ్, ఆజం, సలీముద్దీన్, ముబీన్‌ఖాన్ ఉన్నారు.

పరిశ్రమల్లో తనిఖీలు

జిన్నారం(బొల్లారం), జనవరి 26: జిన్నారం మండలం బొల్లారం పారిశ్రామికవాడలోని పలు పరిశ్రమల్లో పీసీబీ ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్ తనిఖీలు నిర్వహించారు. స్థానికంగా వచ్చిన ఫిర్యాదులపై స్పందించి తనిఖీలు నిర్వహించామన్నారు. బహిరంగ ప్రదేశాల్లోకి విచ్చలవిడిగా పొల్యూషన్ విడుదల చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రెడీమిక్స్ పరిశ్రమలో తనిఖీలు నిర్వహించి పలు సూచనలు చేశారు.